
# సాక్షి
# వికారాబాద్

శనివారం, 3, ఫిబ్రవరి, 2024



**'పది'పై ప్రత్యేక దృష్టి**

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 8లో▸



**అసంపూర్తిగా హాస్టల్ భవనం**

బంట్వారంలో మోడల్ స్కూల్ హాస్టల్ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 8లో▸



**విద్యార్థుల ప్రగతికి 'పీటీఎం'**

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. 9లో▸

## న్యూస్‌రీల్

### టీఎన్‌జీఓల పాత్ర కీలకం

**రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్**



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్

**అనంతగిరి:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో టీఎన్‌జీఓల పాత్ర కీలకమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మఠం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని టీఎన్‌జీఓ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమంలో టీఎన్‌జీఓలు ముందుండి పోరాటం చేసిందన్నారు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఉద్యోగులకు 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. టీఎన్‌జీఓలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు అజ్మత్‌పాషా, నర్సింలు, రమేష్, శివకుమార్, రామకృష్ణ, శ్రీదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### మార్చి 18నుంచి పదో తరగతి పరీక్షలు

**అనంతగిరి:** మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ఉంటాయని డీఈఓ రేణుకదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, 19న సెకండ్ లాంగ్వేజ్ హిందీ, 21 థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్, 23న గణితం, 26న సైన్స్ ఫస్ట్ పేపర్ (ఫిజికల్ సైన్స్), 28న సెకండ్ పేపర్ బయోలాజికల్ సైన్స్, 30న సాంఘిక శాస్త్రం, ఏప్రిల్ ఒకటిన ఓఎస్ఎస్‌సీ మెయిన్ పేపర్ లాంగ్వేజ్ పేపర్ 1, ఒకేషనల్ థియరీ పరీక్షలు, 2న ఓఎస్ఎస్‌సీ మెయిన్ పేపర్ లాంగ్వేజ్ సెకండ్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సైన్స్ మొదటి పేపర్, సెకండ్ పేపర్ మాత్రమే ఉదయం 9.30నుంచి 11 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మిగితా అన్ని పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ సంవత్సరం కొత్తగా సైన్స్ సబ్జెక్టు కోసం రెండు రోజులు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

### నేటి నుంచి కౌన్సెలింగ్

**అనంతగిరి:** ఇటీవల వెలువడిన స్టాఫ్ నర్సు ఫలితాల్లో ఎంపికైన వారికి పోస్టింగుల కోసం శనివారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ హైదరాబాద్ వెంగళరావు నగర్‌లో గల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో ఉదయం 9గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. 10వ తేదీ వరకు ఎంపికయిన అభ్యర్థుల జోన్ ప్రాతిపదికన కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, అపాయింట్‌మెంట్ కాపీ, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

### ఉపకార వేతనాలకు గడువు పొడిగింపు

**అనంతగిరి:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 -24 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న 2022 -23 , 2023- 24 సంవత్సరం పోస్టు మెట్రిక్ హార్డ్ కాపీలను తమ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

### కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

**పరిగి:** కార్మిక సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయా లని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్మికుల తరపున కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో రంగాల్లో పని చేస్తున్న కార్మికులు నేడు కుటుంబాన్ని కూడా పోషించలేని స్థితిలో ఉన్నారన్నారు.

# రానున్న రోజుల్లో కాంగ్రెస్ కనుమరుగే



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వేములు ప్రశాంత్‌రెడ్డి

**లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీని బొంద పెట్టాలి**

- హామీలు అమలు చేయకుంటే తిరగనివ్వం
- అధికారులు చట్ట పరిధిలో పని చేయాలి
- బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వేముల ప్రశాంత్‌రెడ్డి

**వికారాబాద్:** 'కాంగ్రెస్ మోసపూరిత పార్టీ.. వారివి మోసపూరిత వాగ్దానాలు.. అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. రెండు నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి, తప్పు ఒప్పుకొని పదవికి రాజీనామా చేయాలి' అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పర్యటన చివరి నిమిషంలో రద్దు కావడంతో ఆయన స్థానంలో ప్రశాంత్ రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనరల్ బాడీ ఎన్నికల వరకు కాంగ్రెస్ కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మోసగాడని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా, మహిళలకు రూ.2,500 పెన్షన్, రూ.2 వేల సామాజిక పెన్షన్లు రూ.4 వేలకు పెంపు, యువతకు నిరుద్యోగ భృతి లాంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో కేంద్రంలో అధికారంలోకి వస్తేనే అమలు చేయడం సాధ్యమని పేర్కొంటుండటం విడ్డూరమని ఎద్దేవా చేశారు. మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న మీరు కేంద్రంలో అధికారంలోకి ఎలా వస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అలా కాదని, ఆ పార్టీ నేతలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో మాట మాట్లాడతారని పేర్కొన్నారు. అధికారులు, పోలీసులు చట్టపరిధిలో పని చేయడం లేదని, కాంగ్రెస్‌కు వంత పాడుతున్నారని ఆరోపించారు. ఇలాగే వ్యవహరిస్తే మున్ముందు మా సమయం కూడా వస్తుందని హెచ్చరించారు. అప్పుడు గుణపాఠం చెబుతామన్నారు. అధికారులు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులకు విలువ ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తున్నా చూస్తూ ఊరకుంటున్నారని ఆరోపించారు. దాడులు, అన్యాయం జరిగితే 39మంది ఎమ్మెల్యేలు బస్సు కట్టుకొని వస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీ రంజిత్‌రెడ్డి లాంటి మంచి మనిషి, మచ్చలేని నాయకుడు వెతికినా దొరకరని పేర్కొన్నారు. అంత సంపద, అన్ని వ్యాపారాలు ఉన్నా ప్రజలకు సేవ చేయాలనే తపన ఆయనలో ఉందన్నారు. ఇలాంటి వ్యక్తిని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా సమావేశం స్టేజిపై మొదటి వరుసలో కూర్చున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బూమనోళ్ల కృష్ణయ్యను వెనక కూర్చోవాల్సిందిగా సూచించడంతో ఆయన నిరాకరించారు. దీంతో కొంతమంది కార్యకర్తలు ఆయనను బలవంతంగా స్టేజిపైనుంచి దింపేయడం చర్చనీయాంశమైంది.

### తొందర్లోనే మన ప్రభుత్వం వస్తుంది: ఆనంద్

కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు, త్వరలోనే మన ప్రభుత్వం వసుందని అన్నారు. మన ప్రభుత్వం రాగానే కేసీఆర్ గానీ కేటీఆర్ గానీ సీఎం అవుతారని తెలిపారు. ఎంపీ రంజిత్‌రెడ్డి అన్ని వేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎం కాకుంటే వికారాబాద్ జిల్లా అయ్యేదా..? మనకు మెడికల్ కళాశాల వచ్చేదా..?, రూ.96 కోట్లతో బ్రిడ్జి మంజూరయ్యేదా..?, వికారాబాద్ మున్సిపాలిటీకి రూ. 60కోట్లు వచ్చేవా..? అని ప్రశ్నించారు. మొన్నటి వరకు మన ప్రభుత్వంలో చేసిన పనులే ఇప్పుడు తాము చేశామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారని అన్నారు. అనంతరం విద్యా మౌలిక వనరుల కల్పనా సంస్థ మాజీ రాష్ట్ర చైర్మన్ నాగేందర్‌గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు వ్యతిరేకమే అన్నారు. వారు తెలంగాణ కోసం మాట్లాడిందే లేదన్నారు. ఆ పార్టీ నేతల తెలంగాణ ద్రోహులేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీలను గెలిపిస్తేనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని అన్నారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్ మాట్లాడారు. వికారాబాద్ నాయకుల్లో సమన్వయ లోపం ఉందన్నారు. ఇలాగే కొనసాగితే పార్టీ ఉండదని పేర్కొన్నారు. అధిష్టానం బాగానే ఉన్నా, స్థానిక నాయకత్వ లోపం వల్లే ఇక్కడ ఓడిపోయామని అన్నారు. సమావేశం ఉన్న విషయం కూడా నాకు తెలియదని పేర్కొన్నారు. సోషల్ మీడియా గ్రూపుల్లో చూసి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ సర్పంచులను సన్మానించిన సునీతారెడ్డి

# వారి పదవీ కాలమంతా బాధలే

- అభివృద్ధి కోసం సర్పంచులు అప్పులపాలయ్యారు
- బిల్లులు రాక 13మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు
- జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి

**ధారూరు:** సర్పంచులు పదవిలో కొనసాగినంత కాలం బాధలే అనుభవించారని,అయినా ప్రజాసేవలో వెనుకడుగు వేయలేదని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాజీ సర్పంచుల కోసం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదవిలో ఉన్నప్పుడు చాలా మంది సర్పంచులు అభివృద్ధి పనుల కోసం సొంత డబ్బు ఖర్చు చేశారని తెలిపారు. మరి కొందరు అధిక వడ్డీకి డబ్బులు తెచ్చి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైన భార్యాభర్తల గొడవ పడో, పంట నష్టపోయో, వ్యక్తిగత బాధలతోనే ఆత్మహత్యకు పాల్పడుతుంటారు, కానీ బిల్లులు రాక చాలా మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా మీ సమస్యలను పరిష్కరస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో డబ్బుల ప్రభావం ఎక్కువగా ఉంటోందని, మార్పు తీసుకరావాల్సింది మీరేనని పేర్కొన్నారు. మాజీ సర్పంచులను సన్మానించడానికి నిధులు సమకూర్చిన వాలీబాల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డిని ఆమె అభినందించారు. సర్పంచులు మాజీలైనా వారు చేసిన పనులకు ఇంకా ఎంబీ రికార్డులు కాలేదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేల అండదండలతో ఇద్దరు ముగ్గురు సర్పంచులు అక్రమాలకు పాల్పడ్డారని, దీంతో అందరి సర్పంచులకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చెన్నారెడ్డి, ఎంపీఓ షఫీఉల్లా, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం

**వీఎంహోం వద్ద కానిస్టేబుల్ అభ్యర్థుల ఆందోళన**

**హుడాకాంప్లెక్స్:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో జీఓ నం.46ను రద్దుచేస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఇప్పుడు తీరా అధికారంలోకి వచ్చాక మాట మారుస్తోందని కానిస్టేబుల్ అభ్యర్థులు ఆరోపించారు. ఈ మేరకు సరూర్‌నగర్ మండలంలోని విక్టోరియా మెమోరియల్ గ్రౌండ్‌లో వారు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి జీఓ నం .46కు సంబంధించి అనుకూల ప్రకటన రాకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరి ఇదే విధంగా కొనసాగితే వచ్చే ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజల్లో తిరగనివ్వం అన్నారు. వెంటనే సానుకూల నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న సరూర్‌నగర్ పోలీసులు విక్టోరియా మెమోరియల్‌కు చేరుకుని అభ్యర్థులకు సర్ది చెప్పటంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మహేష్, అనిల్, ప్రవీణ్, ఆకాశ్, శంకర్, మధు, వెంకట్, రాముడు, శ్రీకాంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

# 'దేవుడి భూములనూ వదలడం లేదు'

**రైతుల భూములు లాక్కొని వ్యాపారం చేస్తున్నారు**

- బీఆర్ఎస్ నేతలపై మాజీ ఎంపీ కొండా ఫైర్
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను బొందపెట్టాలని పిలుపు
- సార్వత్రిక సమరంలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా

**షాబాద్:** చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ ఇద్దరూ కలిసి నగరంలోని హనుమాన్ దేవాలయాన్ని కూల్చివేసి, ఆ భూమిని కబ్జా చేశారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. షాబాద్ మండలం చందనవెళ్లి భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం.. రైతుల నుంచి గుంజుకుని, రియల్ ఎస్టేట్ వ్యా పారం చేసిందని విమర్శించారు. సీతారాంపూర్ దేవాలయ భూములనూ వదలలేదని మండిపడ్డారు. ఈ స్థలాలను ఆ పార్టీ నేతలు వివిధ పరిశ్రమలకు కట్టబెట్టి, కోట్లు దండుకున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం దేవాలయాలను పరిరక్షిస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ సమావేశం నిర్వహిస్తే..ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు కొంత మంది ముఖ్య నాయకులు గైర్హాజరైనట్లు తెలిపారు.

**ఆ పార్టీలను బొంద పెట్టాలి..**

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను బొంద పెట్టాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా, మాజీ ఎమ్మెల్యే కేఎస్ పిలుపునిచ్చారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, దేశవ్యాప్తంగా 350 కన్నా ఎక్కువ సీట్లను దక్కించుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రకు అన్నీ అపశ్రుతులే ఎదురవుతున్నాయని, ప్రజలు ఆ పార్టీని నమ్మేస్థితిలో లేరని ఎద్దేవా చేశారు.

### పనిచేసే వారికే ప్రాధాన్యత

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కొందరు నేతలు హడావుడి చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నియోజకవర్గ పరిధిలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయమే శిరోధార్యమన్నారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, అసెంబ్లీ కౌన్సిల్ సభ్యుడు ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ.. బీజేపీలో ముందు నుంచి కష్టపడిన వారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు రాము, మహేందర్, నారాయణ, రవీందర్‌రెడ్డి, మాణెయ్య, సత్యం, గోపాల్, మహేశ్, హరీష, శ్రీనివాస్, రాఘవేందర్, ప్రమోద్‌కుమార్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- ఇసుక, రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు
- ఎస్పీ కోటిరెడ్డి



రోడ్డు భద్రతా నియమాలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

**తాండూరు టౌన్:** జిల్లాలో డ్రగ్స్, గంజాయి రవాణాను ఏ మాత్రం ఉపేక్షించేది లేదని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరులో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులు, వాహనదారులతో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలను నడిపి ప్రమాదాల బారిన పడరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, అప్పుడే ప్రమాదాలు జరగవన్నారు. కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, ఎంవీఐ లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, పట్టణ, రూరల్ సీఐలు సంతోష్‌కుమార్, అశోక్, కౌన్సిలర్ సంగీతాఠాకూర్, ఆర్టీసీ డీఎం సమత, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాలా తదితరులు పాల్గొన్నారు.

**అక్రమ రవాణపై నిఘా**

అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ కోటిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి రవాణా చేసినా, కల్తీ ఆహార పదార్థాల తయారు చేసినా, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా చేసినా ఉపేక్షించమని పేర్కొన్నారు. రైల్వే, టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ అధికారుల సహకారంతో దాడులు నిర్వహిస్తామని తెలిపారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 162 మంది బాలకార్మికులను తల్లిదండ్రుల వద్దకు చేర్చామని తెలిపారు. పోలీసు అధికారుల బదిలీలు నిరంతర ప్రక్రియ అని, వారి పనితనాన్ని బట్టి, కాల వ్యవధిని బట్టి మార్పు జరుగుతుందన్నారు. ప్రత్యేక సందర్భంలో ఇక్కడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిదన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పూర్తి స్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. పట్టణంలో కొన్నేళ్లుగా ట్రాఫిక్ సిగ్నల్స్ వెలగని విషయం తమ దృష్టికి వచ్చిందని, కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌తో చర్చించి త్వరలో వాటికి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. షీటీమ్స్ చురుగ్గా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు
- చేవెళ్ల ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి పరిశీలన



కమ్యూనిటీ ఆస్పత్రిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

**చేవెళ్ల:** ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యవిధాన పరిషత్ అధికారి రాజు అన్నారు. చేవెళ్లలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డుల్లో రోగులను కలిసి వైద్యసేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులు సక్రమంగా ఉండటం లేదనే విమర్శల నేపథ్యంలో ఇక్కడనుంచి డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్యులను తిరిగి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని వైద్యాధికారులు తెలిపారు. ఆస్పత్రిలో ప్రతిరోజు ఓపీకి 200లకు పైగా రోగులు వస్తారని వారికి ఆస్పత్రి ఆవరణలో సరిపడా మరుగుదొడ్లు లేవని సిబ్బంది వారి దృష్టికి తీసుకురావటంతో వాటిని వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ల్యాబ్‌లో అత్యవసరమైన సీబీపీ పరీక్షలు చేసే యంత్రం లేదని చెప్పటంతో దానికి సంబంధించిన నివేదికను అందించాలని వైద్యులకు సూచించారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, ఆస్పత్రి ఇన్‌చార్జి సోమశేఖర్, వైద్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

**428 మంది నర్సుల నియామకం**

ప్రభుత్వం ఇటీవల ఎంపిక చేసిన స్టాఫ్‌నర్సుల నియామకాల్లో జిల్లాకు 428 మంది కొత్త స్టాఫ్ నర్సులు వచ్చారని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈ నియామకాలతో జిల్లాలోని ఆయా ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సుల పోస్టులు భర్తీకానున్నట్లు తెలిపారు. ఇందులో 315 మంది జిల్లా ఆరోగ్యశాఖ పరిధిలో ఉండగా 55 మంది వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రులకు, 18 మంది మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలకు, 11 మంది మైనార్టీ గురుకులాలకు, 14 మంది ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి, 13 మంది గిరిజన గురుకుల పాఠశాలలకు, ఇద్దరిని ఎస్సీ గురుకుల పాఠశాలలకు కేటాయించటం జరిగిందన్నారు. వీరికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. దీంతో ఆసుపత్రిలో కొత్తగా వచ్చే సిబ్బందితో ఆయా ఆస్పత్రుల్లో మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు.

## క్లుప్తంగా

### గుడుంబా పట్టివేత



స్వాధీనం చేసుకున్న సారాను చూపిస్తున్న పోలీసులు

యాలాల: అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ఐదు లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి బావ్లానాయక్‌తండాలో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఈ మేరకు తండాలో శుక్రవారం తనిఖీలు నిర్వహించగా, నాటుసారాను గుర్తించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు



ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొనడంతో కారులో ఇరుక్కున్న వ్యక్తి

పరిగి: ట్రాక్టర్‌ను కారు వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటన పరిగి మండలం గడిసింగాపూర్‌ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్‌ మండలానికి చెందిన నవీన్‌, చేతన్‌, శివప్రసాద్‌ పని నిమిత్తం నగరానికి వెళ్లారు. అనంతరం హైదరాబాద్‌ నుంచి ఇంటికి వస్తుండగా.. గడిసింగాపూర్‌ గ్రామ సమీపాన ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ కిందకు కారు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ సీట్‌లో ఉన్న నవీన్‌ వాహనంలో ఇరుక్కోగా.. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన ప్రసాద్‌కుమార్‌

బంట్వారం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం బంట్వారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తొర్మామిడి గ్రామానికి చెందిన ఎస్‌.ప్రసాద్‌కుమార్‌ (28) ద్విచక్ర వాహనంపై యాచారం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నూరుల్లాపూర్‌కు చెందిన తిరుపతిరెడ్డి మద్యం మత్తులో వేగంగా కారు నడిపి, బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. స్థానికులు గమనించి వెంటనే బాధితుడిని అంబులెన్స్‌లో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు నగరంలోని గాంధీ ఆసుపత్రికి పంపించారు. మద్యం సేవించి అజాగ్రత్తగా, అతి వేగంగా కారు నడిపిన తిరుపతిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

### పెంపుడు జంతువుల పరిరక్షణకు కృషి

పశువైద్యురాలు స్ఫూర్తి

కొత్తూరు: పెంపుడు జంతువులను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని మండల పశువైద్యాధికారి స్ఫూర్తి పేర్కొన్నారు. కొత్తూరు పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆమె 'జంతు సంక్షేమం, సంరక్షణ' చట్టాలపై అవగాహన కల్పించారు. వీధి కుక్కలతో పాటు జంతువుల పట్ల ప్రతి పౌరుడు బాధ్యతతో మెలిగి వాటి సంరక్షణ విషయంలో గల చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. వీధి కుక్కలు కరిచినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



# పదిపై ప్రత్యేక దృష్టి



బొంపల్లి పాఠశాలలో ప్రత్యేక పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- ప్రత్యేక తరగతులతో ప్రణాళిక

దోమ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయ బృందం ప్రత్యేక దృష్టి సారించింది. మార్చి 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు. ఈ నెల 5వ తేది నుంచి 12వరకు స్లిప్‌ టెస్టులు నిర్వహిస్తుండగా.. 22 నుంచి 29 వరకు ప్రీ ఫైనల్‌ పరీక్షలు నిర్వహించనున్నామని విద్యాధికారులు చెబుతున్నారు. దోమ మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్‌ పాఠశాలలు ఉండగా.. అందులో ఓ కేజీబీవీ ఉంది. వాటిల్లో 518 మంది విద్యార్థులు టెన్త్‌ ఎగ్జామ్‌ రాసేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది ఫలితాలు అంతంత మాత్రమే రావడంతో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు.

**అర్థవంతమైన బోధన అందిస్తూ..**

విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తు.. వారిని తీర్చిదిద్దుతున్నారు. ప్రతి సబ్జెక్టులోని కీలక అంశాలకు సంబంధించిన ప్రశ్న, జవాబులు ముద్రించి అభ్యాసన స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థులకు అందజేస్తున్నారు. వాటి ఆధారంగా పరీక్షలు నిర్వహించి, వెనుకబడిన వారిని గుర్తిస్తున్నారు. వారికి అర్థవంతమైన బోధనను అందిస్తూ సందేహాలు తీరుస్తున్నారు.

### పట్టుదలతో చదవుతున్నా



ఉపాధ్యాయులు బోధిస్తున్న ప్రత్యేక తరగతులతో మాకు ఎంతో మేలు జరుగుతుంది. రానున్న పరిక్షలను దృష్టిలో పెట్టుకొని పట్టుదలతో పాఠాలు వింటున్న. అధిక మార్కులు తెచ్చుకునేందుకు కృషి చేస్తున్నాను.

– బి.పూజ, పదో తరగతి విద్యార్థిని

### సందేహాల నివృత్తికి దోహదం



ప్రత్యేక తరగతులతో సబ్జెక్టుల్లోని సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. అధిక మార్కులు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం. వందశాతం లక్ష్యంతో తోటి విద్యార్థులతో పోటి పడి చదువుకుంటున్నాం.

– రోహిత్‌, పదో తరగతి విద్యార్థి

### ఉత్తీర్ణత పెంచేందుకు కృషి



పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయులు నిత్యం ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడూ నివృత్తి చేస్తున్నారు. అర్థం కాని బోధనాంశాలను వివరిస్తూ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం.

– వెంకట్‌, కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయుడు, బొంపల్లి

# పీఏసీఎస్‌ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

అధికార పార్టీలోకి మరో ముగ్గురు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి నియోజకవర్గంలో అన్ని విభాగాలు అధికార పార్టీ వశమవుతున్నాయి. మొన్న కోస్గి మున్సిపాలిటీ, తాజాగా బొంరాస్‌పేట మండలం మెట్లకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్‌) చైర్మన్‌ పదవిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. 13 మంది పీఏసీఎస్‌ డైరెక్టర్లలో చైర్మన్‌గా ఇదివరకు చిల్మల్‌ మైలారానికి చెందిన విష్ణువర్ధన్‌ రెడ్డి ఉన్నారు. కాగా గత నెల 18న పెట్టిన పీఏసీఎస్‌ చైర్మన్‌పై డైరెక్టర్ల అవిశ్వాసం పట్ల బలనిరూపణ కోసం నోటీసు జారీ చేశారు. దీంతో శుక్రవారం జరిగిన తీర్మాన సమావేశంలో బీఆర్‌ఎస్‌ పార్టీవైపు బలనిరూపణ తగ్గింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన వైస్‌ చైర్మన్‌ కృష్ణ, డైరెక్టర్లు పోలెపల్లి వెంకటయ్యగౌడ్‌, దుప్‌చర్లకు వెంకటమ్మ, దుద్యాల ఖలీల్‌పాషా అనే ముగ్గురు అధికార పార్టీలోకి వచ్చారు. దీంతో అధికార పార్టీ ఖాతాలోకి చైర్మన్‌ పదవి చేరింది.



అవిశ్వాస తీర్మానంలో బలపరిచిన డైరెక్టర్లు

**నేడు చైర్మన్‌ ఎన్నిక**

అవిశ్వాసంలో నెగ్గిన అధికార పార్టీ డైరెక్టర్లు.. శనివారం చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. చైర్మన్‌ పదవికి మెట్లకుంటకు చెందిన కాంగ్రెస్‌ మండల మాజీ అధ్యక్షుడు జయకృష్ణను ఎన్నుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. సమావేశంలో కోస్గి మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ వెంకట్రాములుగౌడ్‌, అధికారులు, పార్టీ నాయకులు నర్సింహులు గౌడ్‌, శేఖర్‌, రాజేశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు.

## రేపు ఇంటర్‌ ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్‌రూరల్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభ కళాశాలలో ఇంటర్‌ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 4న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కమ్మదనం గురుకుల సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్‌ విద్యుల్లత శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. గురుకులాల సంస్థ కార్యదర్శి డాక్టర్‌ నవీన్‌నికోలస్‌ ఆదేశాల మేరకు సీఓఈ సెట్‌ 2024–25 విద్యా సంవత్సరానికి.. పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధి కమ్మదనం గురుకుల కళాశాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఇందుకు పదో తరగతి చదివే విద్యార్థులు అర్హులని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించారు. ఉదయం 9గంటల వరకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు తప్పని సరిగా తమ వెంట ఆధార్‌ కార్డు, పాఠశాల సంబంధిత బోనఫైడ్‌, బ్లూ, బ్లాక్‌ పెన్ను, హాల్‌టికెట్‌, పరీక్ష ప్యాడ్‌ తెచ్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌, ఎలక్ట్రిక్‌ పరికరాలు అనుమతించబడవని తెలిపారు.

# పదవులు శాశ్వతం కాదు



మాజీ సర్పంచులకు సన్మానం చేసిన ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌

- ప్రజల గుండెల్లో నిలవడమే ముఖ్యం
- ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌

కొడంగల్‌: పదవులు శాశ్వతం కాదని, అవి లేకున్నా ప్రజాసేవలో ఉండాలని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవడమే గొప్ప విషయమని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధి మాజీ సర్పంచులను ఆయన ఘనంగా సన్మానించారు. అంతకు హస్నాబాద్‌ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు లక్ష్మిని సన్మానించారు. ఆమె సేవలకు గుర్తింపుగా.. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెను మండల పరిషత్‌ కార్యాలయానికి పిలిపించి ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. త్వరలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి, లక్ష్మీ సేవల గురించి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏన్గుల భాస్కర్‌, తహసీల్దార్‌ విజయకుమార్‌, ఎంపీడీఓ పాండు, కాంగ్రెస్‌ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌, ఎంపీఓ శ్రీనివాస్‌, మండల పరిధిలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా హాస్టల్‌ భవనం

- పదేళ్లుగా కొనసాగుతున్న పనులు
- పట్టించుకోని ఈడబ్ల్యూఐడీసీ అధికారులు

బంట్వారం: మండల కేంద్రంలోని మోడల్‌ స్కూల్‌ హాస్టల్‌ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో ఆ పాఠశాలకు విద్యార్థులు ఇళ్ల నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. గుత్తేదారుకు పే అండ్‌ అకౌంట్స్‌ నుంచి సకాలంలో బిల్లులు అందకపోవడంతో ఏళ్ల తరబడిగా నిర్మాణ పనులు ఆగిపోయాయి. హాస్టల్‌ భవనం నిర్మాణానికి 10 సంవత్సరాల క్రితం రూ.1.28 కోట్లు మంజూరయ్యాయి. టెండర్‌లో పనులు దక్కించుకున్న గుత్తేదారు, పునాది దశలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో సంబంధిత ఈడబ్ల్యూఐడీసీ అధికారులు రీటెండర్‌ వేయడంతో మరో కాంట్రాక్టర్‌ ముందుకు వచ్చాడు. కానీ, బిల్లులు అందకపోవడంతో సదరు కాంట్రాక్టర్‌ పనులు పూర్తి చేయలేకపోతున్నారు. పదేళ్ల కిందట మంజూరైన హాస్టల్‌ భవనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ పూర్తికాకపోవడం విచారకరం. ప్రస్తుతం గ్రౌండ్‌ ఫ్లోర్‌ పనులు పూర్తయ్యాయి. మొదటి అంతస్తు స్లాబ్‌ దశలోనే నిలిచిపోయింది.



ప్రారంభానికి నోచుకోని హాస్టల్‌ భవనం

**విద్యార్థులకు అసౌకర్యం**

సుమారు 700 మంది విద్యార్థులు బంట్వారంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్‌ వరకు చదువుకుంటున్నారు. హాస్టల్‌ భవనం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా బాలికల కోసమే మంజూరు చేశారు. హాస్టల్‌లో 9వ, తరగతి నుంచి ఇంటర్మీడియట్‌ వరకు 100 మంది బాలికలు ఉండేలా సదుపాయం ఉంది. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ అధికారులు పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. హాస్టల్‌ భవనం నిర్మాణం సమయంలో ఇంజినీరింగ్‌ అధికారుల పర్యవేక్షణ లేనే లేదు. గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. ఇప్పటికైనా ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్తా..



మోడల్‌ స్కూల్‌ హాస్టల్‌ భవనం పదేళ్ల ఏళ్ల నుంచి పూర్తి కావడం లేదు. ఇప్పటికే ఇద్దరు గుత్తేదార్లు మారినట్లు తెలుస్తుంది. సమస్యను కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్తా. హాస్టల్‌ వసతి లేకపోవడంతో బాలికలు అసౌకర్యానికి గురవుతున్నారు. సరియైన రవాణా సదుపాయం లేక దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.

– చంద్రప్ప, ఎంఈఓ

### రీటెండర్‌ వేస్తాం..

మోడల్‌ స్కూల్‌ హాస్టల్‌ భవనం జీప్లస్‌–1 కట్టాల్సి ఉన్నప్పటికీ సబ్‌ కాంట్రాక్టర్‌ ఇబ్బందుల కారణంగా గ్రౌండ్‌ ఫ్లోర్‌ పూర్తి చేసి వదిలేశారు. మిగిలిన పనులకు మళ్లీ రీటెండర్‌ వేస్తాం. ఇందుకు సంబంధించిన బడ్జెట్‌ రూ.40 లక్షలు ఉన్నాయి. మరో రూ.40 లక్షల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపాం. రీటెండర్‌ వేసి మరో నెల రోజుల్లో మిగిలిన పనులను పూర్తి చేయిస్తాం.

– రాజు డీఇ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ

# నిల్వ మాంసం అమ్మితే కఠిన చర్యలు

మున్సిపల్‌ చైర్మన్‌ ముకుంద అశోక్‌కుమార్‌

పరిగి: నిల్వ చేసిన మాంసాన్ని విక్రయిస్తే.. వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్‌ చైర్మన్‌ ముకుంద అశోక్‌కుమార్‌ హెచ్చరించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మటన్‌ మార్కెట్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. దుకాణ దారులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తాజా మాంసాన్ని విక్రయించాలని సూచించారు. నిల్వ కూరను అమ్మిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, మార్కెట్‌ మటన్‌ను విక్రయించనీయమని స్పష్టం చేశారు. పాడైన మాంసాన్ని విక్రయించినట్లు తెలిస్తే.. మున్సిపల్‌ కార్యాలయానికి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాసన్‌, కౌన్సిలర్లు కృష్ణ, వెంకటేశ్‌, రవి కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



మటన్‌ మార్కెట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌

# పోగొట్టుకున్న సొత్తు అందజేత



శశికళకు వస్తువులను అందజేస్తున్న సీఐ శివప్రసాద్‌, సిబ్బంది

పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు

కడ్తాల్‌: కారులో పోగొట్టుకున్న విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను కడ్తాల్‌ పోలీసులు స్వాధీనం చేసుకుని, బాధితురాలికి అప్పగించారు. సీఐ శివప్రసాద్‌ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన శశికళ అనే మహిళ, గత ఏడాది డిసెంబర్‌ 23న ధ్యాన మహాయాగంలో పాల్గొనేందుకు అద్దె కారులో మహేశ్వర మహాపిరమిడ్‌కు వచ్చింది. ఈ క్రమంలో వాహనం దిగి, అందులోనే తన బ్యాగును మర్చిపోయింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ఏఎస్‌ఐ నిరంజన్‌, కానిస్టేబుల్‌ దివ్యవాణి, సిబ్బంది, కారు డ్రైవర్‌ నంబర్‌ను ట్రేస్‌ చేసి, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితురాలు శశికళను రప్పించి, శుక్రవారం స్థానిక ఠాణాలో ల్యాప్‌టాప్‌, 3 బంగారు ఉంగరాలు, లాకెట్‌, డైమండ్‌ చెవికమ్మలు, మ్యాట్నీలు, చార్జెస్‌ ఈయర్‌బర్డ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు శశికళ మాట్లాడుతూ, పోగొట్టుకున్న రూ.4 లక్షల విలువ గల వస్తువులను తిరిగి అప్పగించినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి, సకాలంలో సొత్తు రికవరీ చేసినందుకు పోలీసు ఉన్నతాధికారులు సిబ్బందిని అభినందించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు హరిశంకర్‌గౌడ్‌, వరప్రసాద్‌, ఎఎస్‌ఐ నిరంజన్‌, కానిస్టేబుల్‌ దివ్యవాణి ఉన్నారు.

### మద్యం సీసాలు స్వాధీనం

యాచారం: బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సైదయ్య హెచ్చరించారు. నందివనపర్తి, మొండిగౌరెల్లి, మాల్‌ తదితర గ్రామాల్లో శుక్రవారం బెల్టు దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించి, 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

### ఎంపీ పరామర్శ



యాదయ్యను పరామర్శిస్తున్న రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: అనారోగ్యంతో సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను శుక్రవారం ఎంపీ రంజిత్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల లోబీపీతో ఇంట్లో కాలుజారి పడిపోయిన ఎమ్మెల్యే కాలె యాదయ్య.. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎంపీ.. త్వరగా కొలుకొని పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజల్లోకి రావాలని సూచించారు.

# విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి




విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ శ్రీశైలం

- దురలవాట్లకు దూరంగా ఉండాలి
- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎస్‌ఐ శ్రీశైలం

కుల్కచర్ల: విద్యార్థులు దురలవాట్లకు బానిస కాకుండా.. చదువుపై దృష్టి సారించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎస్‌ఐ శ్రీశైలంలు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషనల్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ.. లక్ష్యం దిశగా పయనించాలని చెప్పారు. అనాలోచిత నిర్ణయాలతో జీవితాలను ఆగం చేసుకోవద్దని, చదువే భవిష్యత్తును నిర్ణయిస్తుందని సూచించారు. తల్లిదండ్రులను గౌరవించి, వారిచ్చే సలహాలు, సూచనలను పాటించాలన్నారు. జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోలుకోలేని స్థితికి చేరుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ఎంఈఓ హబీబ్‌ అహ్మద్‌, ఎంపీటీసీ ఆనందం, మాజీ సర్పంచ్‌ సౌమ్యారెడ్డి, రాకంచర్ల పెంటయ్య, ప్రోగ్రాం మోటివేషనల్‌ స్పీకర్‌ శివకుమార్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పార్టీ చౌడాపూర్‌ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌ కుమార్‌, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, భాస్కర్‌, రాము, పులింగ వెంకటేష్‌, రవీందర్‌, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

# జల్సాలకు అలవాటు పడి.. జీవాల చోరీ

- ముగ్గురు నిందితుల అరెస్ట్‌
- మూడు కార్లు, నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు. స్వాధీనం చేసుకున్న కార్లు

మహేశ్వరం: జల్సాలకు అలవాటు పడి, జీవాలను ఎత్తుకెళ్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులయ తండా, కనుమునూరు గ్రామం, మరికల్‌ మండలం, నారాయణపేట్‌ జిల్లాకు చెందిన డేగావత్‌ ప్రభాకర్‌ నాయక్‌, శివ కుమార్‌, శంకర్‌లు దురలవాట్లకు అలవాటు పడి, తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాలోచనతో దొంగతనాలకు వృత్తిగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో అమీర్‌పేట్‌, మాణిక్యమ్మగూడ, దిల్‌వార్‌గూడ గ్రామాల్లో రాత్రి వేళల్లో గొర్రెలు, మేకల దొంగతనాలకు పాల్పడ్డారు. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు మండల పరిధి చిన్నతూప్ర గ్రామంలో జీవాలను ఎత్తుకెళ్తుండగా.. స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ముగ్గురు వ్యక్తులను, మూడు కార్లు, రూ.1.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఎత్తుకెళ్లిన గొర్రెలు, మేకలను కార్లలో హైదరాబాద్‌లోని జియాగూడ మటన్‌ మార్కెట్‌కు తీసుకెళ్లి, విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది. ఈ సందర్భంగా కేసు విచారణలో చొరవ చూపిన ఎస్‌ఐ సుబ్బారెడ్డి, క్రైం కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌

షాద్‌నగర్‌: బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ పేర్కొన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని రంగంపల్లి, మొగిలిగిద్ద, ఎల్లంపల్లి, కంచివనం, దేవునిపల్లి, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డ, చించోడ్‌, పీర్లగూడ, దొంతికుంట తండాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని అంజయ్య యాదవ్‌ అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని చెప్పారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్‌ చేశారు. మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌ నాయక్‌, నారాయణరెడ్డి, శ్రీశైలం, భీష్వ రామకృష్ణ ఉన్నారు.